హఠాత్తుగా బస్సు ఆగింది !

విశ్వనాథంగారు ఆ కుదుపుకి తూలిపడి తమాయించుకుని, కళ్లజోడు సవరించుకొంటూ 'ఏం జరిగింది ?' అన్నారు.

ఇందిర తన తలని రోడ్డువైపుకి పెట్టి చూచింది.

"మన బస్సే కాదు. మనముందు నాలుగైదు లారీలుగూడా ఆగిఉన్నాయి నాన్నా !" అన్నది.

కండక్టరు, డ్రైవరుతోపాటు కొంతమంది ప్రయాణికులు క్రిందికి దిగారు. లారీలు ఆగిన చోటుకి వెళ్లారు.

అయిదు నిమిషాలు జరిగిన సంగతేమిటో తెలీకపోవడంతో బస్సులో మిగిలిఉన్న ప్రయాణికులు ఆదుర్దా ప్రకటిస్తున్నారు.

బస్సు దిగాను. సిగరెట్టు ముట్టించి అటువైపు కదలబోతుండగా కమలాకరం ఎదురొచ్చాడు.

"ఆ ముందు రోడ్డుకి గండి పడిందిట చూస్తారూ ! అటు బస్సు లటు, ఇటు బస్సు లిటు ఆగిపోయాయి" అన్నాడు.

"మరి అలాగైతే మన ప్రయాణం?"

"అక్కడే కంట్రోలరూ వగైరా లున్నారు. వాళ్లను కనుక్కుని చెప్తానన్నాడు కండక్టరు. రండి. లోపలికెళ్లి కూర్చుందాం."

కమలాకరం ఈవార్త నందజేయగానే నా కేదో విసుగనిపించింది. హైదరాబాద్‌లో అర్జంటు పనంటూ లేకపోయినా, నాకోసం ఎదురుచూచే పూర్ణంగాడి పని మంచి ఇరకాటంలో పడుతుంది. అనవసరంగా వాడికి చాలా శ్రమ నిస్తున్నానేమో ననిపించింది.

సిగరెట్టు బూటుక్రింద పడేసి నలిపాను. మరికొంతసేపు అక్కడే నిలబడి, బస్సెక్కాను. కమలాకరంబస్సులోవాళ్లందరికీ అక్కడేం జరిగిందోవివరించి చెబుతున్నాడు. అందరూ 'అరెరె'అని ఎంతో ఖిన్నులైపోతున్నారు. పాపం వాళ్ళకి హైద్రాబాద్‌లో ఎన్నెన్ని పనులున్నాయో ఏమో మరి!

విశ్వనాథంగారు కమలాకరానికి విసుగు పుట్టేంతవరకూ ప్రశ్నలడిగి, సరైన సమాధానాలొచ్చాయని తృప్తిపడి—తర్వాత కుమార్తెవైపు తిరిగి తీరుబడిగా పకపకా నవ్వేశారు.

ఆయనలా నవ్వడం చిత్ర మనిపించింది. ఆయనవైపు తిరిగాను.

"ఏమోయ్ ... నీకేమైనా అర్జంటు పనుందా?" నన్నడిగారు.

నవ్వి వూరుకున్నాను.

"దారి మధ్యలో ఇలాంటి అవాంతరా లొస్తుంటేనాకు మహ సరదాగా ఉంటుందనుకో" అని మళ్లీనవ్వేశా రాయన.

"ఊరుకో నాన్నా . ... మరీను" ఇందిర విసుక్కుంది

"నిజమమ్మాయ్ ! అంతెందుకూ ?" నేను సర్వీసులో ఉండగా ఒకసారేమైందనుకున్నావ్. జీప్‌లో నాతోపాటు ఇద్దరంటే ఇద్దరేకానిస్టేబుల్సు ఉన్నారు. పోతూన్న జీప్ కాస్తా—" ఆయన తన కథంతా చెప్పేవారేగాని — ఎవరూ వినిపించుకోడం లేదనో, లేక బిక్కమొహాల్తో తిరిగొస్తున్న ప్రయాణికుల్ని ఏం జరిగిందో అడిగి తెలుసుకుందామనో — ఆగిపోయారు.


"ఏం నాయనా ! ఏం జరిగిందిట ?" అని వాళ్లల్లో ఎవర్నో అడిగారు.

"జరగవలసినదంతా జరిగింది. గండి పడింది. కొంపతీసింది" అన్నా డతను చేతి రుమాల్తో మొహం తుడుచుకుంటూ.

"కండక్టరేమన్నాడు ?" బస్సులో ఉన్నవా రెవరో అడిగారు.

"అతను మాత్రం ఏం చేస్తాడు చెప్పండి. ఏదో మార్గం ఆలోచిస్తామని చెప్పాడు." దిగిన ప్రయాణికుల్లో ఒకాయన సమాధానం ఇచ్చాడు.

విశ్వనాథంగారు చుట్ట ముట్టించారు. బస్సంతా ఒక్కసారి కలయజూసి అన్నారు ....



"నేనా రోడ్డుమీద నిలబడతా నమ్మాయ్! ఇక్కడ బొత్తిగా గాలి రావడంలేదు." అని దిగి పోయారు.

"ఆయ నింతకీ ఏమ వుతారు ?"

"ఎవరో రిటైర్డు పోలీసాఫీసరుట!"

"కనిపిస్తూనే ఉంది నాలకం."

—విశ్వనాధంగారు దిగి వెళ్ళిన తర్వాత, ఆయన గురించి గుసగుసలు ప్రారంభ మయినాయి. ఇంది రకు ఇవన్నీ వినిపిస్తూన్నా వినపడనట్టు నటి స్తున్నది.

కమలాకరం తన పక్కనున్నాయన్తో ఈ బస్సుల గురించీ, వాటి లోపాలు గురించీ చెప్తు న్నాడు. రోడ్డు మధ్య గండి పడటమేమిటి ? ఆ నేపం కాస్తా బస్సుయాజమాన్యం మీద తొయ్యడ మేమిటి? అతని వరస చూస్తుంటే నాకు చిరాకనిపించింది.

బస్సులో జరుగుతూన్న ఈ చిన్నసైజు గలా టాలో తనకేమీ పాత్ర లేదన్నట్టు ముభావం వహించాడు, ఇందిర—వాళ్ల సీటు వెనగ్గా కూర్చున్న నూటాయన ! ఇంత ప్రయాణంలోనూ అతను నోరు విప్పి ఒక్క చిన్న మాటైనా అనలేదు. హెమింగ్వే నవల చదవడంలో పూర్తిగా మునిగి పోయాడు. అప్పుడప్పుడూ చుట్టుప్రక్కల చూస్తూ.

మరో పది నిమిషాలు గడిచేసరికి బస్సులో ఉన్నవాళ్లందరూ విసుక్కోడం మొదలెట్టారు.

"ఆ కండక్ట రేమయ్యాడు ? మనల్నిలా వది లేసి అతని కేవిటా పెత్తనాలూ ?"

"నే చెప్తున్నంచో చూస్తున్నాను. ఎందుకలా కండక్టరుమీద విరుచుకు పడతారు ? ఓ ప్రక్కనే ఈ ప్రయాణం ఎలా పూర్తిచేయడంరా భగ వంతుడా అని—పాపం—అతను. దిగులు పడుతూంటే మరో పక్కన మీరేమోని—"

"కండక్టరు మీకు చుట్టమా ఏమిటయ్యా ? వత్తాసు పలుకుతున్నావ్ ?"

"లేకపోతే ఏమిటండీ ? అతను మాత్రం ఏం చేస్తాడు ?"

"ఏదో చెయ్యమని ఎవ డేడుస్తున్నాడూ—ఏం జరిగిందో చెపితే చాలదూ ?"

"ఊరుకోండి మాష్టారూ ! మధ్య మీ రెందుకూ పోట్లాడుకుంటారు ?" కమలాకరం పోట్లాడుకుంటూన్న (పొరపాటైతే మాట్లాడు కుంటూన్న) ఆసామీ లిద్దర్నీ వారించాడు. ఆ తర్వాత కాసేపటికి యిద్దరూ రాజీపడ్డారు.

నూటూవాలావైపు చూశాను. అతను ఇంది రతో ఏదో నెమ్మదిగా చెప్పాడు. ఆమె వినిపించుకో నట్టు ముభావం వహించి, తర్వాత చిరాకు ప్రద ర్శించింది. ఆశ్చర్యపోయాను.

మొత్తానికి అతను ఘటికుడేను. కాకపోతే అలా విశ్వనాధంగారు బస్సు దిగిన సమయం చూచి, ఆమెను మాటాడించడ మేవిటి ? సూటు ధరించి నంత మాత్రాన రాదు సంస్కారం.

"సిగరెట్లు అయిపోయాయి. ఈ అడవిలో ఎంకెక్కడ దొరుకుతాయి. చచ్చాన్రా భగవంతుడా" కమలాకరం నాకు వినిపించేలా భగవంతుడ్ని ఉద్దే శించి స్వగతం లాంటిది పలికాడు.

"కాల్చండి." సిగరెట్టు పాకెట్టు అతని ముం దుంచాను.

"వద్దులెండి. బస్సు కదిలిన తర్వాత—"

"ఫర్వాలేదు తీసుకోండి."

"థాంక్సు." అతనో సిగరెట్టు తీసుకుంటూ అన్నాడు.

సిగరెట్టు ముట్టించి గట్టిగా పొగ వదులుతూ.

"కాబట్టి—ఇప్పుడీ అవస్థ కూడా ఒకానొక అనుభవం ! ఏమంటారు ?" అన్నాడు.

అవునన్నట్టు తలూపాను.

సూటువాలా చివాలున లేచి నించున్నాడు. కిందికి దిగి వెళ్లిపోయాడు. అతను వెళ్లిన తర్వాత కమలాకరం అన్నాడు—

"బలే చిత్రమైన మనుషు లుంటారు మాష్టారు ! ఆవతల కొంపలంటుకుపోతున్నా మన కెందుకులే అన్నట్టు ఏమీ పట్టనట్టు కూర్చుంటారు. ఈరకం వాళ్లంటే నాకు గిట్టదు. బెజవాడ నుండి చూస్తున్నాను—ఇన్నిసార్లు మన మందరం కలిసి కాఫీలు తాగామా ? కమ్మగా కబుర్లు చెప్పుకున్నామా ? పరిచయాలు చేసు కున్నామా ? — చూడం డతన్ని, పెట్టి బిగ్గుకు తారం ! అక్కడికీ రెండు మూడు మాట్లు నేనే పలుకరించాను. ఎంతవరకు వెడుతున్నారూ, మీ పేరేమిటి అని అడిగినదానికి ఒక్క ముక్కతో సమాధానం తప్ప మళ్లీ నోరెత్తలేదు. దీన్నే మంటారు ? ముభావమా, లేక తలతిక్కా ?"

"పోనీండి. అది అతని తత్వం. ఇంతమాత్రా నికే మన కొచ్చిపడిన నష్ట మేముంది ?"

"మంచిమాటన్నారు."



ఆ సూటువాలా ఎంత ముభావంగా ఉన్నాడో ఈ కమలాకరం అంత వాగుడుపెట్టె. ఇతనికి సరైన జోడు విశ్వనాధంగారు. బందరు నుండి ఇంతవరకు వాళ్లిద్దరూ నవ్వుకుంటూ మాటాడు కున్నారు, వాళ్లిద్దరి మధ్యా ఇంతకుముందే పరి చయం, చనువూ ఉన్నట్టు. బస్సు రొదలో ఒకాళ్లమాట మరొకాళ్లకి ఎక్కడ వినిపించదో నన్న దిగులుకొద్దీ గొంతు చించుకుని మాటాడు కున్నారు. కమలాకరం యువకుడు కాబట్టి అంత గట్టిగా మాటాడినా అర్థమున్నది. విశ్వనాధంగారు అంత వయస్సులోనూ కుర్రాడిలా మాటాడాలంటే ఎంత ఓపిక కావాలి ? ఆశ్చర్యమే మరి !

విశ్వనాధంగారిని గురించి నాకు పెద్దగా తెలీదు. అలాగే మిగతావారి గురించీను. బెజవాడలోనూ, జగ్గయ్యపేటలోనూ, సూర్యాపేటలోనూ కలిసి కాఫీలు తాగడం మూలంగా పరిచయమయ్యారు విశ్వనాధంగారు, ఇందిర, కమలాకరమూను.

విశ్వనాధంగారి స్వీయ చరిత్ర వినేవాడికి నిజంగా ఓ పరీక్షే. ఆదీ, అంతూ ఉండదు. ఎదుటివాడి ఇబ్బందిని గమనించకుండానే మాటాడేస్తుంటారు. ఎవరో కమలాకరంలాటి నిబ్బరంగల మనిషి (నాలాటి మొహమాటస్తుడూ) తప్ప మరొకడైతే ఒక అరగంటలోనే ఆయనకు దూరంగా ఉండాలని కోరుకుంటారు.

ఆయన రిటైర్డ్ పోలీసాఫీసరు. కంటి ఆప రేషన్ నిమిత్తం హైదరాబాదు వెడుతున్నారు రెండో కుమార్తె ఇందిరతోపాటు. హైదరా బాద్లో పెద్ద కూతురు (వనజ అని చెప్పినట్లు జ్ఞాపకం) ఉన్నదట. అల్లుడు సెక్రటేరియట్లో ఉన్నతోద్యోగిట. మళ్లీ ఓ నెల రోజుల్లో ఇంటి కొచ్చేస్తారట విశ్వనాధంగారు. బందరు దగ్గర ఓ చిన్న పల్లెటూరు ఆయన స్వగ్రామం.

ఇందిర క్రితం ఏడాదే బి. ఏ. పాసయిందిట, అంతకంటె ఇంకో వివరం తెలీదు.

కమలాకరం గురించి తెలుసుకున్నది—అదీ విశ్వ నాధం గారితో చెప్పగా విన్నది — అతను బాగా డబ్బూ దస్కం ఉన్న ఓ ధనికుల ముద్దుబిడ్డడు. ఏకైకపుత్రుడు. హైదరాబాద్లో సరదాగా ఓ వారం రోజులు 'ఖర్చు' చెయ్యటానికి వస్తున్నాట్ట.

విచిత్ర మేమిటంటే—ఈ కాఫీల పరిచయం మమ్మల్ని బాగా దగ్గర చేసింది. ఒకరి చిరునామా ఒకరు పుచ్చుకున్నాం. ఈ స్నేహాన్ని ఇలాగే కొన సాగించాలని అనుకున్నాం.

[నాతోపాటు ప్రయాణం చేస్తున్న వాళ్ళ గురించి ఇంత రాయడానికి కారణం లేకపోలేదు. అసలు వాళ్ళ గురించే ఈ కథ రాయడం జరుగు తుంది. క్షమించాలి—ఈ కథ శీర్షిక 'నలుగురు'— అని కదూ రాశాను. ఇప్పటి వరకూ మీకు పరి

చయం చెసంది ముగ్గుర్నీ. నాలుగో అతను ఆ సూటువాలా ! అతని గురించి నాకూ తెలీదు గనక కథ మొదట్లో — మీకు చెప్పనేలేదు. ఇక కథ చదవండి.]

—ఉసూరుమంటూ కండక్టరూ, తదితరులూ వచ్చారు. బస్సులోనున్న జనమంతా ఒకేసారి అడిగారు.

"ఏం తేల్చారు ?"

"ఈ రాత్రికి ఇక్కడే జాగారం చెయ్యాలి" అన్నాడు కండక్టరు.

"చచ్చాం పో .... ఇంకా వేరే మార్గం లేదు టయ్యా."

"ఉంది. తెల్లవార్లూ ఇక్కడ ఉండటాని కిష్టపడనివాళ్ళూ, అర్జంటు పనులున్నవాళ్ళూ—లారీలు బోల్డు వస్తున్నాయి— ఇక వాటిలో పోవడమే మార్గం" కండక్టరు వెంట ఉన్న ఓ ప్రయాణికుడు అన్నాడు.

"అయితే డబ్బు వాపసు ఇవ్వబడదు" అన్నాడు కండక్టరు.

"డబ్బు సంగతి అలా ఉంచు. లారీలైనా ఈ గండి నెలా దాటి వెడతాయి?"

"భువనగిరి మీద నుండి వెడతాయట. ఎవరైనా నాతోపాటు వచ్చేవాళ్ళంటే రావచ్చు." అన్నాడు వెనకటి ప్రయాణికుడు.

"పోనీ మన బస్సునే అటునుంచి మరలిస్తే!"

"ఏమా కంట్రోలరు అందుకు ఒప్పుకోలేదు సార్!" అన్నాడు కండక్టరు.

మిగతా వివరాలన్నీ కండక్టరు వెంట వచ్చిన ప్రయాణికుడు చెప్పి తన వస్తువులేవో చేత్తో పట్టుకుని వెళ్ళిపోయాడు. అతనోతోపాటు మరో యిద్దరు కూడా వెళ్ళారు. కండక్టరు తన క్యాష్ వగైరాలను బస్సులో పెట్టి డ్రైవర్‌తోపాటు కలిసి దూరాన ఉన్న ఓ చెట్టుక్రింద కూర్చుని సిగరెట్లు కాల్చుకోవడం మొదలెట్టాడు.

ఈ వరస చూచిన కమలాకరం వళ్ళుమండి పోయింది కాబోలు—

"కండక్టరికేం—నిశ్చింతగా సిగరెట్టు ముట్టిస్తాడు. బాధపడేది మనమేగా. రండి విశ్వనాధం గారూ! మనం కూడా ఏ లారీయో .... "

"నో .... నో .... నే నలా వచ్చేవాణ్ణి కానోయ్ కమలాకరం ! నేను ఛార్జీ చెల్లించాను. రేపు కాదు గదా మరో నాలుగు రోజులకి బయలుదేరినా నే నీ బస్సుమీదనే వెడతాను."

"సరే .... నేనూ అలాగే చేస్తాను." అన్నాడు కమలాకరం.

"నీకు తెలీదు గాని—అనుకోకుండా యిలా దారి మధ్యలో ఓ అడవిలాటి ప్రదేశంలో రాత్రి సమయంలో మజిలీ చెయ్యడమంటే ఎంత సరదా అనుకున్నావ్. బలేగా ఉంటుంది. అమ్మా ఇందూ—ఆ ఫ్లాస్కు ఇల్లా పట్రా తల్లీ."

విశ్వనాధంగారూ, కమలాకరం, ఇందిరా—ముగ్గురూ ఓ చెట్టుక్రింద కూర్చుని మాటలాడుకుంటున్నారు. వాళ్ళ క్కాస్త అవతల ఓ పది అడుగుల దూరంలో మరో చెట్టుక్రింద కూర్చుని పుస్తకం చదువుకుంటున్నాడు సూటువాలా !

# నలుగురు

నాకేం చెయ్యాలో తోచడంలేదు. అలా ఒకసారి గండి పడిన చోటుకి వెళ్ళాను. అక్కడ కంట్రోలరు కూలీలను హడావిడిగా కేక లేస్తున్నాడు. అప్పటి కప్పుడే మట్టి బస్తాలు, రాళ్ళు, ఇసకా తెప్పించేస్తున్నాడు. రెండు లారీలు మాట్లాడుకుని యిసుక తెప్పించటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

హైద్రాబాద్ ఇక్కడికి దాదాపు ఏనభై మైళ్ళ దూరంలో ఉన్నది. తెల్లవారితేనేగాని మా బస్సు తిరిగి బయలుదేరదు. అంతవరకూ ఈ రోడ్డు మీద ఎక్కడ పడిఉండటం ?

రెండు ఫర్లాంగుల దూరంలో ఆరు, ఏడు పెంకుటిళ్ళు ఓ గుంపుగా ఉన్నాయి. గమ్మత్తేమిటంటే హైద్రాబాద్‌కు పోయే దార్లో ప్రతీ పదీ ఇరవై మైళ్ళకి డజనిళ్ళు చొప్పున ఒక గుంపుగా ఉంటాయి. అదే ఒక చిన్న గ్రామం అనుకోవలసి వస్తుంది మరి.

గుమాస్తాతో ఆఫీసరు :
ఏమోయ్! ఇంతకు ముందే ఎవరో వచ్చి, నీకు ఒంట్లో బాగా లేదు. సెలవిప్పించమని చెప్పావని చెప్పి వెళ్ళాడు?
గుమాస్తా : హీ...హీ... వాణ్ణి రేపొచ్చి చెప్పమన్నానండి. మర్చిపోయి ఈ రోజే చెప్పా డనుకుంటానండి.
కె. రంగారావు (మద్రాసు)

రాత్రికంటూ ఉండాల్సివస్తే ఆ యిళ్ళల్లో ఏదో ఒక ఇంట్లో తల దాచుకోక తప్పదు. దాని కోసం తొందరగా ఆ యింటివారి నెవర్నయినా కలుసుకుని మాటాడుకోవాలి.

బస్సుదగ్గరకు వచ్చి, సూటుకేసు తీసుకుని కిందికి దిగాను. విశ్వనాథంగారు చప్పట్లు చరుస్తూ నన్ను పిలిచారు. నా రాకను గమనించిన సూటువాలా నావైపు ఒకసారి చూచి మళ్ళీ పుస్తకంలో తల దూర్చాడు. అతని పద్ధతికి నవ్వు వచ్చింది.

"ఏమయ్యా రావూ ! సాక్షాత్తు మమ్మల్నిక్కడ వదిలిపెట్టి ఎటు షికారుకు బయలుదేరావూ ?"

చెప్పాను.

"అప్పుడే ఏం తొందర వచ్చిందని ? అందరం కలిసే వెళ్ళి ఎవర్నో ఆశ్రయం అడుగుదాం. తప్పుతుందా మరి. కూర్చో."

కూర్చోక తప్పిందికాదు.

"ఆ .... అన్నట్టు హైదరాబాద్‌లో ఎక్కడికెళ్ళాలో ?"

"చిక్కడపల్లి"

"అదే...మేమూ అక్కడికే....ఎవరింటికో ?"

"పూర్ణచంద్రరావని టెలిఫోన్సు ఆఫీసులో పని చేస్తుంటాడు."

"పూర్ణచంద్రరావా ? అంటే ఆ కరణాల కుర్రాడు. బక్కగా, తెల్లగా"—

అవునని తలూపాను.

"స్నేహితుడా ?"

"బంధువు కూడాను."

"అలా చెప్పు. అతనిల్లు కూడా సరిగ్గా మా అల్లుడిగా రింటి పక్కనే—ఓ డాబాలో పోర్షను తీసుకున్నాడు. ఇంతకీ నీకా ఇల్లు తెలుసునా ?"

"తెలీదు."

"అయినా ఫర్వాలేదులే. నేను తీసు కెడతాను. ఆ .... అన్నట్టు ఏం పనిమీద వెడుతున్నావ్ ?"

"పనంటూ ప్రత్యేకంగా ఏమీ లేకపోయినా—"

"ఏంపనీ లేకపోవడ మేమిటయ్యా ?"

"అక్కడ కొందరు రచయిత లున్నారు. వాళ్ళను కలుసుకోవాలని—"

ఈ సమాధానం విని ఆయన గట్టిగా నవ్వేశారు. ఆగి ఆగి నవ్వుతున్నారు. తర్వాత అడిగారు.

"బలే .... ఇదేం పనయ్యా రావూ ! రచయితలను కలుసుకుంటావ్!" మళ్ళీ నవ్వారు.

నాకు చిర్రెత్తుకొచ్చింది. ఏమీ టీయన ఉద్దేశ్యం! రచయితలంటే ఎందుకూ పనికిరాని వాజమ్మలనా? వాళ్ళని కలుసుకోటానికంటే-అంత హేళన చేస్తా రెందుకు ?

"కొంపతీసి నువ్వు కథలు రాస్తావా ఏమిటి ?"

ఆయనకు నిజం చెప్పాలనిపించలేదు. రాయనని అబద్ధం చెప్పాను.

"రక్షించావ్. రచయితవు కాదుగదా ! చూశావు రావూ .... ఈ రాసేవాళ్ళల్లో ఏం గొప్పతనం కనిపించిందని వాళ్ళని ఆకాశాని కెత్తేస్తున్నావ్ ? రాసే దానికి ఒక ప్రయోజన మంటూ ఉంటే అప్పుడు మెచ్చుకున్నా అర్థముంది. ఈ రాతలవల్ల సంఘానికీ, మనిషికీ లాభం ఏమిటీ ? వీటివల్ల ఏమైనా చైతన్యం కలిగిందా ?— ఇవన్నీ ఆలోచించాలోయ్. అవేం లేనినాడు వాళ్ళని గౌరవించడం వృధాయేను. ఇదే విషయమై మా ఇందుకి కూడా చెప్తుంటాను కథలంటే మా అమ్మాయికి కూడా మోజేను."

ఆయన ఉపన్యాసం ఆపి, ఫ్లాస్కులో కాఫీ కాస్త నా కిచ్చాడు. కాఫీ తీసుకుని, తర్వాత అన్నారు.

"నీ అభిప్రాయం నీది—నా అభిప్రాయం నాది. నే నిలా అని నిన్ను నిరుత్సాహపరచినందుకు కష్టపడకు. నిక్షేపంగా అందర్నీ కలుసుకో. అదిగాక చిక్కడపల్లి పరిసరాల్లో రచయిత లెక్కువ! నాగ్గూడా కొందరు తెలుసు. కావలిస్తే పరిచయం చేయిస్తాను. సరా !" అన్నా రాయన నా మౌనాన్ని చూచి బాధపడుతూ.

'ఒకే పడవలో పయనిస్తున్నాం! అప్పుడప్పుడూ ఒకర్నొకరం పరామర్శించుకొనడం, పలుకరించుకోడం ఎంతైనా అవసరం' అన్నారొక ప్రసిద్ధ కథకులు. మళ్ళీ ఈ ప్రవచనం ఆయనకు అప్పగించి, దానిమీద నా కిష్టంలేని చర్చ ఆయన ద్వారా రేగడం సహించలేను. అందుచేతనే ఆయ నిచ్చిన కాఫీని గప్‌చిప్‌గా తాగేశాను. నవ్వు తెచ్చుకుని థాంక్సు చెప్పాను.

ఒకందుకు మాత్రం సంతోషించాను. మావాడి ఇల్లు తెలుసునన్నారు కాబట్టి ఏ వేళకి వెళ్లినా పర్వాలేదు. లేకపోతే రేపుదయం నాడు బస్సు స్టాండుకి నాకోసం వస్తాడో రాడో. అలాంటప్పుడు వాడికోసం ఎక్కడని వెతకను ? సమయానికి దేవుడిలా కలిసి ఆ అవస్థ తప్పించారు విశ్వనాథంగారు.

విశ్వనాథంగారు కొత్త చుట్ట వెలిగించి నాలుగు వైపులా చూచి అడిగారు— "ఇందాక బస్సులో ఏదో విషయం చెబుతూ మధ్యలో ఆగిపోయాను కదూ. అదేమిటంటే, నేనూ మరో యిద్దరు కానిస్టేబిల్సూ కలిసి నూజివీడు దగ్గర ఓ అడవి దారిగుండా జీప్‌మీద పోతున్నాం. దట్టంగా చీకటి. వర్షపు జల్లు. ఉరుములూ, మెరుపులూ. బాగా అడవి మధ్యగా వచ్చిన తర్వాత ఒకచోట హఠాత్తుగా టైర్ పగిలి జీప్ ఆగిపోయింది. సరిగ్గా అదే సమయానికి మా గుండెలదిరేలా ఫెళ్ళున ఎక్కడో పిడుగు పడింది." ఆయ నిక్కడ చెప్పడం ఆపారు.

కమలాకరం నా పక్కకి జరిగాడు భయంగా. అతన్నా స్థితిలో చూడగానే నవ్వు పుట్టుకొచ్చింది. అతని భయాన్ని గుర్తించానని గమనించాడు కాబోలు—కాస్త సర్దుకుని అన్నాడు.

"నాకు ఇలాటి విషయాలంటే చాలా ఇష్టం మాస్టారు. చెవి కోసుకుంటాను."

"అలా అన్నావ్ బాగుంది.... పిడుగు పడిందని కదూ చెప్పాను. ఆ పిడుగు ఎక్కడ పడిందనుకున్నారు—సరిగ్గా మాకు వంద గజాల దూరంలో ఓ తాటిచెట్టుమీద పడ్డది. అది పడిన మరుక్షణం ఆ తాటిచెట్టు నిలువునా నుసైపోయింది. అది వేరే విషయం. ఇక మా సంగతి. నాతోపాటు ఉన్న ఇద్దరు కానిస్టేబుల్సూ గడగడా వణికిపోతున్నారు. నేనే గనక అక్కడ లేకపోతే ఘొల్లున ఏడ్చేవారు కూడాను. నాకు మాత్రం బలే సరదాగా ఉన్నది. జీప్‌లో కూర్చొని కనిపించని వర్షాన్ని చూస్తున్నాను. మీకు తెలుసో తెలీదో గాని అడవిలో వర్షం బహు అందంగా కురుస్తుంది. కళ్లు మిరుమిట్లు గొలిపే మెరుపుల వెలుగులో వర్షం ఎంత కురుస్తుందో స్పష్టంగా కనుపిస్తోంది. ఓ పక్కన ఉరుములు, మరో పక్కన వెలుగు, ఇంకోపక్కన వర్షం—కాసేపు కిందికి దిగి గంతులేదా మనుకున్నాను."

"ఆ అడవిలో పులులుండవా సార్ ?" అన్నాడు కమలాకరం మరింత దగ్గరకు జరుగుతూ.

"ఎందుకుండవూ ? ఇప్పుడు కాబట్టి ఆ ప్రాంతాల్లో ఊళ్లు వెలిశాయి గాని అప్పుడు ఆ ప్రాంతాలన్నీ పులులు తిరిగేవేగా. ఈ విషయం గురించే మా కానిస్టేబుల్స్ భయపడి 'రాత్రంతా ఇక్కడే గడపాలా సార్ ?' అన్నారు. చివరి కెలాగైతేనేం, వాళ్లిద్దరికీ ధైర్యం చెప్పి ఊరడించాను. తుపాకి తీసుకుని ఆ రాత్రంతా నే నొక్కడ్నే పహరా ఉన్నాను."

"బలే .... మంచి ధైర్యవంతులే" అన్నాడు కమలాకరం. తుపాకీ విషయం విన్న తర్వాత ఇంకెంత ఘోరం వినాల్సివస్తుందోనన్న భయం నొద్దీ విశ్వనాథంగారి మాటకి అడ్డు తగిలాడు.

"సరిగ్గా ఇలాగే అన్నారు మా పోలీసులు. తర్వాత ఆ చుట్టుపక్కల నేను చాలా ధైర్యవంతుణ్ణని పేరు సంపాయించుకున్నాను. పెద్ద పెద్ద దొమ్మీలు గట్రా జరిగితే నేనే వెళ్లేవాణ్ణి. అలా వెలిగించాను సర్వీసంతా. అలాంటివాడికి ఈ చిన్న ఆటంకం ఓ లెక్కా జమా !"

"అవును మరి." విశ్వనాథంగారి కథ అయిపోయిందన్న ధీమాకొద్దీ గట్టిగా గాలి పీల్చుకుని అన్నాడు కమలాకరం.

మూటువాలా మాతో నిమిత్తంలేకుండానే పుస్తకం చదువుకుంటున్నాడు చాలా సీరియస్‌గా. పుస్తకంపైన వో మూలగా 'ఆనందరావు' అని చక్కగా రాసివున్నది. కాబట్టి అతని పేరు ఆనందరావు. కాని పేరుకుతగ్గ మనిషి కాదు. వంటరితనం, మధనంలోనే అమితమైన ఆనందం ఉంటుందని ఎవరైనా అంటే మాత్రం, వాళ్లకే అతను సార్థక నామధేయుడిలా కనుపిస్తాడు.


"ఈనాటి కుర్రాళ్లమీద నా కసలు సదభిప్రాయమంటూ లేనే లేదోయ్ రావూ !" విశ్వనాథంగారు అక్కడ కూర్చున్న మా నలుగురికీ వినిపించేలా అన్నారు.

"ప్రేమా ప్రేమా అని వట్టి నోటి దూలేగాని, ప్రేమించి పెళ్లి చేసుకుని సుఖ మనుభవిస్తోన్న యువకుడు ఒక్కడూ కనుపించడంలేదు. అథవా ప్రేమించి పెళ్లిచేసుకున్నా ఆ సంసారం కాస్తా రెండు మూడు సంవత్సరాల్లో ముక్కలై పూరుకుంటుంది. మనిషికి ధైర్యం, సాహసం లేకపోతే ఇలాగే తగులడుతుంది మరి." విశ్వనాథంగారు సందర్భమంటూ ప్రత్యేకంగా ఏదీ లేకుండా ప్రయోగించిన ఈ వ్యాఖ్యానానికి మాతోబాటు ఆనందరావు కూడా చలించాడు.

"నేను ప్రేమించి పెళ్లిచేసుకున్నాను. అదీ వర్ణాంతర వివాహం." అన్నా రాయన మాతో సంబంధం లేనట్టూ, మమ్మల్నుద్దేశించి మాటాడనట్టూను.

ఆయనకున్న ఈ 'క్వాలిఫికేషన్' నన్ను ఆకర్షించింది. ఆయన చెప్పబోయే విషయాన్ని శ్రద్ధగా వినాలన్న ఉద్దేశ్యంతో కాస్త ముందుకు జరిగాను.

"మా బంధువులందరూ మమ్మల్ని వెలివేశారు. పోనీలే అని సరిపెట్టుకున్నాను. పెద్దపిల్లని నా కులంవాడే చేసుకున్నాడు. ఇప్పుడు ఈ ఇందిరకు పెళ్లికావాలి. ఇందిరంటే ప్రాణాలు పెడతాడు మా మేనల్లుడు. అయితేనేం వాడు తండ్రిమాట జనదాటని శ్రీరామచంద్రుడు. వయస్సుంది, ఆలోచించే జ్ఞానముంది — అలాంటప్పుడు తండ్రి చెప్పుచేతల్లో నడవడం నా కిష్టంలేదు. అందుకనే అతనంటే నాకు అసహ్యం. వాడు ప్రస్తుతం హైద్రాబాద్‌లో మెడిసిన్ చదువుతున్నాడు. ఇటు ఇందిరమీద ప్రేమా, అటు తండ్రిఅంటే భయం—ఈ రెంటిమధ్యా నలిగిపోతున్నాడు. అలాంటివారికి నాదొక హెచ్చరిక. నువ్వు చేసేది మంచిదనితోస్తే ఈ చుట్టాలూ పక్కాలూ, అనుబంధాలూ అభిమానాలూ అవతలకి తోసిపారేసి నీకు నచ్చింది చెయ్యి. అంతేగాని ఏం చేతగాని చవటలా ధైర్యానికి వాయిదా వేస్తూ బ్రతకడం నా కిష్టంలేదు. నన్ను చూడండి—మా నాన్న, అన్నయ్య, తల్లిలా పెంచిన వదిన—యిందరు కాదంటున్నా మనసిచ్చిన యువతిని పెళ్లిచేసుకున్నాను. సుఖాన్ని అనుభవించాను. దేనికైనా సరే—కొంత సాహసం, తెగింపు కావాలి. అందుచేత నే చెప్తాను, జీవితమంతా అడుగడుక్కీ 'అడ్వెంచర్స్' తో నిండిపోతూంటే అంతకంటె



ఆనందం ఇంకోటి ఉండదని." ఆయన చుట్టని అవతలికి గిరాటు వేశారు.

జీవితమ్మీద ఆయనకున్న అభిప్రాయానికి మనస్సులో అభినందనలు అర్పించాను. నిజమే మరి—ఆయన చెప్పిన జీవితం ఎంతమంది అదృష్టవంతుల కున్నది? విశ్వనాథంగారిమీద గౌరవ భావం విపరీతంగా కలిగింది.

మరో అయిదు నిమిషాల వరకూ ఆయన తన జీవితంలో ఎదుర్కొన్న సమస్యలు గురించి చెప్పారు.

ఆ పావుగంటా ఇందిర తల వంచుకుని నేలమీద ఏదో పిచ్చిగీతలు గీస్తూ కూర్చున్నది. తన గురించీ, తమ కుటుంబం గురించీ ఆయనలా చెప్పడం ఆమె కిష్టంలేదు కాబోలు.

ఇదేమీ గమనించే స్థితిలో లేరు విశ్వనాథం. పిరికివాళ్ళనీ, అవకాశవాదుల్నీ విమర్శించేస్తున్నారు దారుణంగా. ఇప్పటివరకూ—ఏమీ తోచని రిటైర్డ్ ఆఫీసరుగానే ఆయన్ను భావించాను. జీవితంపైన ఆయన కిన్ని చక్కటి అభిప్రాయా లున్నాయని ఇప్పుడే తెలుసుకున్నాను.

—చీకటిపడ్డ తరువాత ఆయన లేస్తూ అన్నారు.

'ఇక పదండి. ఏదైనా ఇల్లు చూసుకుని ఈ రాత్రి అక్కడే గడిపేద్దాము. మరో చిన్నమాట—ఏదో నాకున్న అభిప్రాయాల్తో మిమ్మల్ని బాధిస్తే—'

"బలేవారు సార్. మాకు తెలీని విషయాలు చాలా చెప్పారు" అన్నాడు కమలాకరం.

విశ్వనాథం అతని భుజాన్ని లాలనగా తట్టారు.

—అందరం కలిసి కండక్టరు దగ్గరకు వెళ్లాం. అతను ఉదయం ఆరు గంటలకి గాని బస్సు కదలదని చెప్పాడు. ఏమీ అభ్యంతరంలేకపోతే బస్సులోనే ఉండమన్నాడు. కాని—విశ్వనాథంగారు, దగ్గరున్న ఆ ఇండ్లలో ఎక్కడైనా ఉంటామని, బస్సు కదిలే ముందు ఓసారి మమ్మల్ని పిలవమనీ చెప్పారు. సరేనని తలూపాడు కండక్టరు.

ఆనందరావు కూడా మా వెనకనే నెమ్మదిగా నడుస్తూ వస్తున్నాడు. కాస్త ముందుగా విశ్వనాథంగారూ, ఇందిరా నడుస్తున్నారు. ఆయనేదో ఇందిరకు చెప్తున్నాడు. వాళ్లకు వెనగ్గా నేనూ, కమలాకరం నడుస్తున్నాము.

కొంత దూరం వచ్చిన తర్వాత కమలాకరం అన్నాడు.

"నాకు ఆకలిగా ఉంది మాష్టారూ!" అని.

—విశ్వనాథంగారు ఓ ఇంటిముందు నిలబడి ఇంటివారిని పిలిచాడు. ఓ నల్లటి పొడుగాటి మనిషి బయటకొచ్చాడు.

"నీ పేరేమిటయ్యా" అని అడిగాడు విశ్వనాథం.

"యాదగిరి."

"గూడ్ .... చూడు యాదగిరీ. మా బస్సు రోడ్డుమీద ఆగిపోయింది. తెల్లవారితేనేగాని కదలదుట. కాబట్టి ఈ రాత్రికి మీ ఇంట్లో కాస్త జాగా ఇస్తావూ—"

యాదగిరి మా అందరివంకా ఓ రెండు నిమిషాలపాటు చూచి ఒకసారి ఇంట్లోకి వెళ్లి తిరిగొచ్చి "రండి" అన్నాడు.

అందరం లోపికి వెళ్లాము. యాదగిరి మాకు రెండు గదులు చూపించాడు. విశ్వనాథంగారూ, ఇందిరా ఒక గదీ — నేనూ, కమలాకరం, ఆనందరావూ ఒక గదీ తీసుకున్నాము.

కాసేపు అందరం చావిట్లో కూర్చుని పిచ్చాపాటీ మాటాడుతున్నాము. ఆనందరావు ఓ మూలగా గోడకి చేరగిలబడి ఏదో ఆలోచిస్తున్నాడు.

యాదగిరి వచ్చి అడిగాడు—

"పాపం .... మీకు ఆకలిగా ఉందేమో .... ఇంట్లో పళ్ళూ, పాలున్నాయి. పుచ్చుకుంటారా?"

"నీ కెందుకీ శ్రమ. ఇప్పుడు మాకేమీ అక్కర్లేదులే యాదగిరీ!" అన్నారు విశ్వనాథం.

కమలాకరం నన్ను కళ్లతో హెచ్చరించాడు 'ఏమిటిది' అన్నట్టు.

"శ్రమేముందండీ. పాలూ, పళ్లేగా."

గబగబా ఇంట్లోకి వెళ్లి అరటిపళ్లు తీసుకొచ్చి మా అందరికీ ఇచ్చాడు. అవి తిన్న తర్వాత పాలు తీసుకొచ్చాడు. పాలు తాగుతూ కమలాకరం అన్నాడు:

దొంగనోట్ లేవో మంచి
నోట్లేవో నీకు తెలుసా? అడి
గాడు సాంబం, శంకరాన్ని.
అసలు నోట్లంటూ వుంటే వాటిని
దొంగవైనా దొరవైనా
మార్చుకోగలరన్నాడు శంకరం.

పి. శ్రీనివాస్ రావు.

"దేవుడు దొరికాడు!"

"పిచ్చోడా—అవసరం వచ్చినప్పుడు ఒక మనిషిని మరో మనిషి ఆదుకోడం దైవత్వం కాదోయ్ సిసలైన మానవత్వం. కాబట్టి యాదగిరీ! మీకు మా హృదయపూర్వక ధన్యవాదా లర్పించుకుంటున్నాం" విశ్వనాథంగారు అన్నారు.

యాదగిరి చిన్నగా నవ్వి పూరుకున్నాడు. పడుకునేందుకు చాపలు తెచ్చి మా కిచ్చాడు.

దాదాపు పది గంటలక్కాబోలు నిద్రపట్టింది.

* * *

నాకు మెలకువ వచ్చేసరికి కోడి కూసింది.

వాచీ చూసుకున్నాను. అయిదున్నరయింది. గదిలో నే నొక్కణ్ణే ఉన్నాను. కమలాకరం గానీ ఆనందరావుగానీ లేరు. వాళ్ల వస్తువులేవీ కనపించకపోవడంతో మరీ ఆశ్చర్య మనిపించింది. లేచి కూర్చుని మళ్లీ ఓసారి గదినంతా పరికించి చూశాను. నా తలవైపున ఓ కాగితం మడతపెట్టి ఉన్నది. ఆత్రంగా విప్పి చదివాను.

ప్రియమైన స్నేహితులు రావ్‌గార్కి,

ఇప్పుడు పన్నెండయింది. ఉదయం పది గంటలకు నాకు హైద్రాబాద్‌లో ఇంటర్వ్యూ ఉన్నది. ఈ బస్సుమీదనే వెడితే ఇంటర్వ్యూకి అందుకోడం కష్టం. లారీమీద వెళ్లటానికి నిశ్చయించుకున్నాను.

బి. ఏ పాసయ్యి మూడు సంవత్సరా లయింది. దురదృష్టం వెంటాడుతోంది. ఇంటిదగ్గర వయసు ముదిరిన తల్లీ, పెళ్లికాని ఇద్దరు చెల్లెళ్ళు నన్నే నమ్ముకుని ఆశలు పెంచుకుంటున్నారు. ఇంటర్వ్యూలతో విసిగిపోయాను. నాలుగుసార్లు హైద్రబాద్ తిరిగాను. ఈమాటు ఇంటర్వ్యూకి హాజరవ్వడానికి డబ్బులేదు. అమ్మ దాచుకున్న పది హేను రూపాయలు అవసరానికి అడ్డుపడ్డాయి. ఆవిడ కన్నీళ్లతో నన్ను ఆశీర్వదించి పంపింది. వస్తున్నాను. ఇదే తుది ప్రయత్నం రావుగారూ.

ఇలాంటి పరిస్థితుల్లో ఏం చెయ్యాలో వో పట్టాన తోచిందికాదు. ఇప్పుడే నిద్రనుండి లేచి చుట్టూ చూశాను. ఆనందరావూ, ఇందిర దూరంగా నిలబడి ఏదో మాటాడుకుంటున్నారు. విశ్వనాథంగారి గురక స్పష్టంగా వినిపిస్తోంది. మీరు వళ్ళుమరచి నిద్రపోతున్నారు. మంచి సమయం. దొంగ నయ్యాను.. మీ పర్సులో ఉండే పదులు దొంగిలించాను. అదృష్టవంతుణ్ణయితే మీచేత మంచివాణ్ణనిపించుకోడానికి ఈ జన్మలోనే మీ పైకం మీకు ముట్టచెబుతాను. లేదూ— ఏం రాయాలో తోచడంలేదు. నేనంటూ మిగలకపోతే మీ పైకం ఇంకెలా ఇస్తాను?

కాలక్షేపం కొరకు, మీ అందరి స్నేహం కోసం ధనికుణ్ణని చెప్పాను. అలా చెప్పకపోతే మీ అందర్లోనూ అలుసైపోతానని నా భయం. ఇది ఒక రకమైన 'న్యూనతా భావం.'

నేను నిర్భాగ్యుణ్ణి. ఒక్కోసారి నాకు నేనే అర్థంగాను. నా గురించి విపులంగా మీకేం చెప్పుకోగలను? విశ్వనాథంగార్కి నా నమస్కారాలందజేయండి. అదృష్టం పండితే మళ్లీ కనుపించి క్షమాభిక్ష వేడుకుంటాను. మీ పరిచయభాగ్యం లభించిన ఒకానొక అభాగ్యుడు,

కమలాకరం.

ఆశ్చర్యపోయాను! అతనిమీద జాలి కలిగింది.

పక్కమీద నుండి లేచి విశ్వనాథంగారి గదికేసి వెళ్లాను. ఆయనకూడా అప్పుడే లేచారు కాబోలు నన్ను చూసి నవ్వుతూ అన్నారు:

"ఆనందరావ్ ఉత్తరం రాసిపెట్టి వెళ్లాడోయ్ రావూ—మా అమ్మాయిని రిజిష్టర్ మారేజి చేసుకుంటాట్ట. మనం హైదరాబాద్ చేరుకునేసరికి రిజిస్ట్రారాఫీసులో వాళ్ల పెళ్లి జరుగుతూంటుందిట. వచ్చి ఆశీర్వదించమంటున్నాడు."

అదిరిపడ్డాను. వయస్సొచ్చిన తన పిల్లని, ఎవరో ముక్కూ, మొగం తెలీని పరాయి యువకుడు ఇలా అర్ధరాత్రి చడీచప్పుడు కాకుండా తీసికెళ్లి పెళ్లి చేసుకోబోతున్నానని ఉత్తరం రాస్తే ఈయనింకా నవ్వుతూ నిలబడ్డాడేమిటాని ఆశ్చర్యపోయాను.

"ఆనందరావ్ ఎవరో కాదోయ్ రావూ!— మావాడే, మేనల్లుడు. నిన్న నా ఉపన్యాసం బాగా పనిచేసింది కాబోలు .... ధైర్యంచేశాడు."

మళ్లీ నవ్వేశా రాయన.

దూరంగా బస్సు హారను వినిపించింది.

వాళ్లను ఇళ్లు కదలకుండా జేశా. డున్నాళ్లుగా. ఇక ఒకడు వేరుబోతే మిగతా ఇద్దరు కూడ వేరుబోతే తన కే వృద్ధాప్యంలో కావలసింది లేక ఎంతగా కుశించవలసి వస్తుందో. తనకు కావలసింది నలు ఏరు తనకు దగ్గరగా ఉండటమే; అంతా బుల్లె మ్మదే తప్పు. దాందేం బుద్ధో గాని కోడళ్ళ గావి రంపాన బెడ్తుంది. అడ్డు చెబితే "మీరు సంచి, నేను చెడు కాబోలు, మీరేం పట్టించుకో ద్దు" అంటుంది. ఈ అత్తా కోడళ్ళ చరిత్ర ంతం ఎప్పుడుంటుందో గాని త నామెను వల్లెత్తు మాటనలేకుండా ఉన్నాడు. అతను ఆలోచిస్తూ కూచున్నాడు.

బుల్లెమ్మకు కోపం తగ్గింది. గబగబ వెళ్లి పోయింది. గర్వంతో కూడిన చిరునవ్వు ఆమె ముఖంలో తాండవమాడింది.

ఆ సాయంత్రమే గోదావరొడ్డున ముగ్గు రన్న దమ్ములు మాట్లాడుకుంటున్నారు. గోదావరి నీళ్లతో నిండుగా ఉంది. ముక్కోటి ప్రజలకు అన్నదానం చేసే అన్నపూర్ణలా హడావిడిగా పోతోంది. నీటి గలగల ధ్వనులు, చల్లని గాలి వారికి కొంత ఉపశమనం గల్గించినవి. పెద్దన్నయ్య అంటు న్నాడు "ఇంట్లో నరకమనే ఇలా వస్తుంటానురా. ఏం చేయాలో తోచదు."

"మాకు మాత్రం తెలిదేమిటి? చూస్తూ చూస్తూ వేరు బోలేము. ముగ్గుర్లో ఒక్కర మైనా డిగ్రీ సంపాదించామా ? చదవండ్రా బాబూ అని మొత్తుకున్నా అందరం చిల్లర మొల్లరగా తిరిగి ఇలా ఇంటర్ తో ఏడుస్తున్నాము. వచ్చే జీతాలు అద్దెకు, బియ్యానికే చాలవు. అప్పుడే ముగ్గురు పిల్లలు తయారు .... అయినా నాన్న సంచి దిట్టమైన కంచె వేశాడు మన చుట్టూ .... " రెండోవా డన్నాడు.

శంకర్ కిదంతా నచ్చలేదు. "ఏమో! నా కీ సుడి గుండంనించి బయటపడే మార్గం ఒక్కటే తోస్తోంది. ఆఫీసులో బోలెడు పని, ఇంటికొస్తే కోడళ్ల బాధలు; నళిని చెబుతుంటే విసుగే స్తుంది. వేరుపోదా మంటుంది. అలాగే చేయాలి. మీరు కూడా అలాగే అనండి. నాన్న భయపడి ఒక మెట్టు లొంగుతాడేమో—

"పిచ్చిపుల్లయ్యా—నాన్నదగ్గరా పప్పులేమీ ఉడకవ్. చూస్తావుగా—ముగ్గురి కొక్క చిల్లి గవ్వయినా రానివ్వకుండా అంతా చెల్లెలి కిచ్చేస్తే ఏం చేయగలం? ఈ సంసారకూపంల బడి గిలగిల తన్నుకోవాల్సిందే." పెద్దవా డన్నాడు విచారంతో.

"ముగ్గురం అమ్మ దగ్గర కెళ్లి కోడళ్లని ప్రేమగా చూడమని చెబితేనో . . . ." రెండో అన్నయ్య మాటల కడ్డు తగిలాడు శంకర్: 'గయ్ మని లేచి మన ముగ్గుర్ని తిట్టిపొయ్యదూ ? కోడండ్రను నే నేం కష్టపెడుతున్నానురా, మంచి అలవాట్లను, పొదుపును నేర్పుతూ, కాస్త గద్దిస్తే తప్పేనా, • తప్పుజేస్తే వాళ్లమ్మలుతిట్టరూ ? .... ఎందుకులే ఇలాంటి వెన్నో చెబుతుంది."

"ఈ అత్తా కోడండ్లను సృష్టించిం దెవ్వరా .... "

"ఏమో .... లేకుండా ఉన్నా బావుండేది."

# బంగారు పంజరం

24-వ పేజీ తరువాయి

"అసలన్నయ్యా! అమ్మ ఇలా వదినెలను కష్ట పెట్టటం ఎలా మొదలెట్టింది? ముందు ప్రేమ గానే ఉండేదిగా .... "

"ఏమో శంకరం .... ఎప్పటినించో తెలీదు. అసలు మన మెలా ఒప్పుకుంటున్నాం" పెద్ద అనయ్యన్నాడు

"అది కూడ 'ఏమో' నే—తెలీదు—అంటే మనం చవటలం, చేతకానివాళ్లం — అన్నమాట" రెండోవా డన్నాడు.

"అది కాదు కారణం .... అమ్మఎదురుగా నించుని మాట్లాడలేక పోవటం ..... అంతేలే— నీ వన్నట్లు—చేతకానితనం అన్నమాట."

ముగ్గురూ పేలవంగా నవ్వారు. "నాన్న మాత్రం తక్కువా, తను సంపాదించిన ఆస్తిని గూర్చి చెబుతూ తన మాట వినకపోతే మనకొచ్చే కష్టా లను మాటిమాటికి చెబుతూ మానని పుండ్లను తయారుజేశాడుగా" శంకర్ అన్నాడు.

కొత్తగా పనిలో పెట్టుకున్న కుర్రవానితో గృహిణి:

అబ్బాయ్! ఇంట్లో చెప్పిన పనులన్నీ జాగ్రత్తగా చెయ్యి. ఈ నెల రూ 30లు లిస్తాను. బాగా చేశావంటే వచ్చే నెలనుంచీ రూ. 50లు లిస్తాను.

కుర్రవాడు: అయితే వచ్చే నెలనుంచే పన్లోకి వస్తానండి.

కె. రంగారావ్, (మద్రాస్)

"మనలాంటి కుటుంబా లెన్నో ఉన్నాయి. అలా కష్టాలనుభవిస్తూనే దినాలు, సంవత్సరాలు గడిపే స్తారు. ఆతరం అంతమైపోతుంది. పుట్టుట గిట్టుట కొరకే—అనే సూక్తి ఎంత నిజమో అలానే ఇలాంటి కుటుంబాలు తయారై పెరిగి పెద్దవై అంతమొందుతాయి. ఆ కుటుంబంలోని వ్యక్తులు కూడ అందుకు తగ్గట్టే ప్రవర్తిం చాలి. ఏ ఒక్కరం మన పాత్ర సరిగా నటించమో అప్పుడే విప్లవం లేస్తుంది. కానీ ఆ 'ఒక్కరు' గా ఎవ్వరూ ఉండటాని కిష్టపడరు. అందుకే జీవి తంలో దుఃఖం, నిస్పృహ, పతనం కల్గుతుం టాయి." పెద్దన్నయ్య దూరంగా తేలిపోతున్న పడవలకేసి చూస్తు అన్నాడు.

కొన్ని క్షణాలు గడిచినై. "ఆ ఒక్కరుగా నే నుంటా నన్నయ్యా" అన్నాడు శంకరం గబు క్కున. ఇద్దరన్నలు తమ్ముడికేసి వింతగా చూశారు. వా రిద్దరికి తెలుసు. శంకరం మంచి తెలివిగలవాడని, కొన్ని క్లిష్ట సమస్యల నెదు ర్కొనే మనస్థైర్యం గలవాడని. సరిగా చదువుకో లేదు గానీ లేకపోతే ఎమ్మే పాసయ్యేవాడిక్ కళ్లే వాడు గాడూ ?

పెద్దన్నయ్య శంకరం భుజం తట్టుతూ ఆప్యా యంగా అన్నాడు: "నువ్వు చిన్నవాడివిరా శంకరం. ఈ విషయంలో జోక్యం కలిగించుకోకు. వేరు బోయాక పడే కష్టాలు ఇప్పటివాటితో పోల్చి చూస్తే వెయ్యి రెట్లు పెద్దవిగా ఉంటాయి. చదువు లేదు, పలుకుబడి లేదు, అనలైంది డబ్బు లేదు — తలిదండ్రుల జాలి, ప్రేమలకు దూరమైతే జీవితం కంటక భూయిష్ఠమై, నా నా యాతనలు పడాలి. మన దగ్గర లేందీ—అమ్మ, నాన్న దగ్గరున్నాయి. నళినికి నచ్చజెప్పు. మనం చేయ గలిగిందేమీ లేదు."

"పదేలే అన్నయ్యా—నేనేం చిన్నవాడిని కాదు—ఇరవైనాలుగేళ్లు దాటాయి. కష్టాల నెదుర్కొని ధైర్యంతో జీవితయాత్రను సాగించాలనే ఉద్దేశం నాలో నాటుకుపోయింది. ఈ వయస్సులో అలాంటి కోర్కె కల్గటం ఆశ్చర్యం కాదు. ఎందుకో నా ప్రయత్నంలో సఫలుడనవుతాననే నమ్మకం నాకుంది" శంకరం అన్నాడు.

"నీ ఇష్టం."

ముగ్గురూ ఇల్లు చేరేవేళకి ఎప్పుడూ చూడని దృశ్యం వారి కంట బడింది. గువ్వాని కవతలి వైపు నళిని వెక్కివెక్కి ఏడుస్తోంది. రెండో కోడలు చేతికి కట్టు కడుతోంది. పెద్దావిడ పెరటి గువ్వాని కానుకుని కన్నీరు కారుస్తోంది. ఆడ బిడ్డ వంట దినుసులు, బియ్యం ఉండే గదికి తాళం వేస్తోంది. అత్తగారు అందర్నీ పరిశీలనగా చూస్తోంది. హాలు వాకిట్లోంచి చూస్తే ఈ దృశ్యం కళ్ల కెదురుగా స్పష్టంగా కనిపిస్తోంది. స్వతహాగా శాంతపరుడైన పెద్దవాడు ముఖం చిట్లించి తిరిగి బయటికెళ్లిపోయాడు. రెండో వాడు హాలులో ఉన్న ఈజీచెయిర్లో పడుకుని భారంగా కళ్లు మూసుకున్నాడు.

శంకర్ తిన్నగా పెద్దవదినదగ్గర కెళ్ళాడు. శంకర్ను చూచి ఆమె మరీ దుఃఖంతో కన్నీరు కారు స్తోంది.

"ఇలా వచ్చి ఈ అరుగుమీద కూచో వదినా" అన్నాడు.

ఆమె మాట్లాడకుండా వచ్చి కూచుంది. "ఇప్పుడు చెప్పు ఏమైందో." తల్లి, చెల్లెలు వెళ్లిపోయారు గాని శంకరం వాళ్లని గూడ కూచోమన్నాడు. "ఈ గదికి తాళంవేసే పరిస్థితి ఎందు కొచ్చిందో తెలుసుకోవాలి. మీరూ కూచోండి."

"ఇక చెప్పు వదినా. ఉన్నదున్నట్లు చెప్పు."

"ఏంలేదు శంకరం .... రోజూ ఉండేదేగా ...."

"అబ్బ—అ[illegible] సంగతి చెప్పమంటుంటే" శంకరం కోపంతో అరిచాడు.

"నాకు బియ్యం తినటం అలవాటుకదూ శంకరం—నిన్నటినించి నోట్లో బియ్యం పడలేదు. తినాలనిపించింది. నళినికి చెప్పాను. అత్తయ్య నడిగి సిగరెట్లు ఇచ్చాడు బియ్యం తెమ్మనమని. నళిని అత్తయ్య కోసం చూస్తే లేదు. ప్రక్కింటి